పరిహారమివ్వరు.. పనులు చేపట్టరు

- కోయిల్‌సాగర్ ద్వారా 138 ఎకరాల సాగునీటికి కాల్వ నిర్మాణం
- పరిహారం అందకపోవడంతో రైతుల ఆక్షేపణ
- నష్టపోయిన భూమికి వేరేచోట భూమి ఇవ్వాలని డిమాండ్


దాసర్‌పల్లి గ్రామ సమీపంలో అసంపూర్తిగా ఉన్న కాల్వ నిర్మాణం

చిన్నచింతకుంట: ప్రతి ఏకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో చర్యలు చేపడుతుంది. అందుకు చెరువులు, కుంటల్లో నీటిని నింపేందుకు నూతన కాల్వల నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగానే కౌకుంట్ల మండలం రాజోలి చెరువు నుంచి చిన్నచింతకుంట మండలం గూడూర్ చెరువు వరకు ఉన్న గొలుసుకట్టు చెరువులకు కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నీటిని నింపేందుకు 2018 సంవత్సరంలో 8కిలోమీటర్ల పొడవు 138 ఎకరాలకు సాగునీరు అందేలా నూతన కాల్వ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.27కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అధికారులు కాల్వ నిర్మాణం పనులు ప్రారంభించి కొంత వరకు కొనసాగించి మధ్యలోనే వదిలేశారు. దీంతో కాల్వ నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో రైతులు పంటలను సాగు చేసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారు.

భూములను కోల్పోతున్న రైతులు..

రాజోలి గ్రామ చెరువు నుంచి అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిర్మలాపూర్, గూడూర్ గ్రామాల గొలుసుకట్టు చెరువులకు నీటిని నింపుతూ పంటపొలాలకు సాగునీరు అందించేందుకు ఐదేళ్ల కిందట అధికారులు నూతన కాల్వ నిరాణం పనులు ప్రారంభించారు. కాగా, రైతుల పొలాల్లో కాల్వ నిర్మాణం కొనసాగుతున్నా ఎలాంటి నష్టపరిహారం అందివ్వకపోవడంతో అట్టి పనులను రైతులు అడ్డుకున్నారు. కాల్వ నిర్మాణంతో దాదాపుగా వంద మంది భూములను కోల్పోతున్నారు. ఉన్న కొద్ది భూమి కాల్వ నిర్మాణంలో కోల్పోతే భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు వేరేచోట భూములు చూయించాలని మొర పెట్టుకుంటున్నారు. నష్ట పరిహారం చెల్లింపుతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా, అధికారులు కాల్వ నిర్మాణం సాగే పొలాల్లో రైతులు పంటలను సాగు చేసుకుంటే కాంట్రాక్టర్ అట్టి పంటలను ధ్వంసం చేసి రైతులకు నష్టం కలిగించడంతో పాటు వారిని బెదిరింపులకు గురిచేస్తున్నాడని రైతులు వాపోతున్నారు. ఎలాంటి నష్టపరిహాం ఇవ్వకుండానే బెదిరింపు చర్యలకు కాంట్రాక్టర్ పాల్పడడం సరికాదని మండిపడుతున్నారు. భూమికి బదులుగా భూమిని చూయించేవరకు కాల్వ నిర్మాణం పనులు అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు.

పనులు త్వరలోనే కొనసాగిస్తాం..



రాజోలి చెరువు నుంచి గూడూర్ చెరువు వరకు చేపట్టిన కోయిల్‌సాగర్ కాల్వ నిర్మాణం పనులు భూ సేకరణ కారణంగా నిలిచిపోయాయి. భూ సేకరణ చేపట్టిన వెంటనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతాం.

– చందునాయక్, ఇరిగేషన్ డిప్యూటీ డీఈ

కాల్వ నిర్మాణం నిలిపివేయాలి..



రాజోలి చెరువు నుంచి గూడూర్ చెరువు వరకు అక్రమంగా కాల్వ నిర్మాణం చేపట్టి రైతులకు ఇబ్బందులను కల్గిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా దాదాపుగా వంద మంది రైతులు భూములు కోల్పోతున్నారు. ఉన్న కొద్ది భూమి కోల్పోతే జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తనున్నాయి. భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం కాకుండా ప్రభుత్వం మరోచోట భూములను చూయించి ఆదుకోవాలి.

– కిష్టారెడ్డి, రైతు, దాసర్‌పల్లి

అర ఎకరమే మిగిలింది..



నాకున్న రెండు ఎకరాల భూమిలో ఎకరన్నర భూమి కాల్వ నిర్మాణానికి పోతుంది. అర ఎకరం పొలం మాత్రమే మిగులుతుంది. ఉన్న భూమి కోల్పోతే జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తుతాయి. కుటుంబం రోడ్డున పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి ఎంత భూమి కోల్పోతే అంత భూమిని వేరే చోట చూయించాలి. లేదంటే కాల్వ నిర్మాణం నిలిపివేయాలి.

– శ్రీనివాసులు, రైతు, దాసర్‌పల్లి

క్లుప్తంగా

3న రక్తదాన శిబిరం

జడ్చర్ల: స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 3న స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోకవర్గంలోని బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, నాయకులు ప్రణీల్‌చందర్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



గండేడ్: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ లలిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దవార్వాల్‌లో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమష్టి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. వచ్చిన నిధులతో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామన్నారు. పన్నులు సకాలంలో కట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హంస తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



అడ్డాకుల: మండలంలోని రాచాలలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. రాత్రి వరకు జరిగిన ఈ పోటీల్లో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానం రూ.60వేలు, గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దొడ్డికి చెందిన లక్ష్మీనారాయణ వృషభరాజాలు రెండో స్థానం రూ.50వేలు, వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ వృషభరాజాలు మూడో స్థానం రూ.40వేలు, అనంతపురం జిల్లా సోమలదొడ్డికి చెందిన రామసుబ్బారెడ్డి వృషభ రాజాలు నాలుగో స్థానం రూ.30వేలు, నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్తకోటకు చెందిన డాక్టర్ గురునాథ్ వృషభరాజాలు ఐదో స్థానం రూ.20వేలు నిలిచాయి. విజేతలకు స్థానిక సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్, వైస్ ఎంపీపీ రాధిక, ఆలయ ధర్మకర్త గొని చెన్నారెడ్డిలు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నగదు బహుమతి దాతలు గొని మాధవరెడ్డి, బండారి వెంకటన్న, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, బొక్కల లక్ష్మయ్య పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత పెద్దకడుమూర్

అడ్డాకుల: మండలంలోని రాచాలలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక సర్పంచ్ తల్లి పాశం చెన్నమ్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మూలమల్ల జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు సాగిన పోటీల్లో 40జట్లు పాల్గొనగా, మూల్లమల్ల, కంచిరావుపల్లి జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. సోమవారం రాత్రి జరిగిన తుది పోరులో కంచిరావుపల్లి జట్టుపై మూలమల్ల జట్టు గెలిచి విజేతగా నిలిచింది. అమ్మాపూర్ జట్టు మూడో స్థానంలో, పెద్దకడుమూర్ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు స్థానిక సర్పంచ్ పాశం తిరుపతయ్య యాదవ్, వైస్ ఎంపీపీ రాధిక, ఆలయ ధర్మకర్త గొని చెన్నారెడ్డిలు నగదుతో పాటు బహుమతులను అందజేశారు.

వాలీబాల్ పోటీల విజేత నాగర్‌కర్నూల్..

జాతర సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జట్టు విజేతగా నిలువగా, మహబూబ్‌నగర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. వనపర్తి, నారాయణపేట, గద్వాల జట్టు మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. విజేతలకు సర్పంచ్ తిరుపతయ్య బహుమతులను అందజేశారు.

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయండి

నవాబుపేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవ సమితి అధ్యక్షుడు లింబ్యానాయక్, గౌరవ అధ్యక్షుడు చందర్‌నాయక్, శంకర్‌నాయక్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని బంజార భవన్ లోఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న మండల కేంద్రంలోని బంజారభవన్ ఆవరణలో సేవాలాల్ జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలు హాజరైతున్నట్లు వివరించారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన బంజారభవన్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో గిరిజన నాయకులు చందర్‌నాయక్, రాజునాయక్, సేవ్యానాయక్, నర్సింహనాయక్, గోపాల్, లింగ్యనాయక్, తరుణ్, శ్రీను, శంకర్, రవి, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు రిలే దీక్షలు



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మంగళవారం మాదిగలు డప్పుల దండోరాతో మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి సభ్యులు 8వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే దీక్షలు కొనసాగిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి, శ్రీహరిగౌడ్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నేరాల అదుపు కోసమే కార్డెన్‌సెర్చ్


వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

బాలానగర్: నేరాలను అదుపు చేసేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జడ్చర్ల రూరల్ సీఐ జమ్ములప్ప పేర్కొన్నారు. మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలో 21 ద్విచక్రవాహనాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు నంబర్ ప్లేట్, పత్రాలు లేని మూడు వాహనాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రజల్లో అప్రమత్తత పెంచడానికే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని వివరించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అద్దెకు ఉంటున్న వ్యక్తుల ఆధార్‌కార్డులు, వాహనాల పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జయప్రసాద్, వెంకట్‌రెడ్డి, రాంలాల్ నాయక్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం


మాట్లాడుతున్న చెన్నకేశవరెడ్డి

నవాబుపేట: సీపీఎస్ రద్దు కోసం ప్రయత్నాలు చేస్తున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఆయన మండలంలో వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పోమాల్ జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కావాల్సిన అన్ని రకాల ఫిట్‌మెంట్ సాధించడంలో తన పాత్ర అందరికీ తెలుసన్నారు. ఆలోచించి మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు సదాశివుడు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు కృష్ణ, పద్మావతి, విద్యావతి, సబిత, హన్మంతు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన అభ్యర్థి గుర్రం కేశవరెడ్డికే మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అప్పంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లిలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా క్రీడల అధికారి శ్రీనివాసులు విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహదారుడ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సతీష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహ, నెహ్రూ యువకేంద్రం యూత్ కోఆర్డినేటర్ కోటానాయక్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

భూత్పూర్: బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాటికొండ, శేర్‌పల్లి–హెచ్ గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీలకు రూ.20లక్షల వ్యయంతో పంచాయతీ భవన నిర్మాణానికి 1వ వార్డులో జాతీయ రహదారి నుంచి గెగ్యాతండా వరకు రూ.కోటీ 32లక్షల వ్యయంతో బీటీరోడ్డు నిర్మాణం, మహబుబ్‌నగర్ బైపాస్ నుంచి నల్లగుట్ట, రాందాస్‌తండా వరకు రూ.కోటీ 90లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ బస్వరాజుగౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ బాల్‌కోటి తదితరులు పాల్గొన్నారు.

టీటీయూ డైరీ ఆవిష్కరణ..

భూత్పూర్ మండలం అన్నసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి నివాసంలో మంగళవారం టీటీయూ డైరీని ఆవిష్కరించారు.



బకాయిలు చెల్లించి సహకరించండి


బకాయిలు చెల్లిస్తున్న రైతులు

నవాబుపేట: సహకార సంఘంలో రుణాల చెల్లింపు ముమ్మరంగా సాగుతుందని సంఘం చైర్మన్ నర్సింహులు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం బకాయిల్లో కేవలం 12రోజుల్లోనే 25శాతం పూర్తి చేశామని తెలిపారు. మొత్తం రూ.2కోట్ల వరకు బకాయిలు ఉండగా, తాజాగా రూ.50లక్షలు బకాయిలు వసూలు చేసినట్లు వివరించారు. సోమవారం ఒక్కరోజే రూ.18లక్షల బకాయిలు వసూలు చేశామని తెలిపారు. మార్చి నెలలోపు పూర్తిగా వందశాతం వసూలు లక్ష్యంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సహకార సంఘం సభ్యుడు ప్రతాప్, ముడా డైరెక్టర్ చెన్నయ్య, సీఈఓ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామా చేయించడం సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిడ్జిల్: కాంగ్రెస్ పార్టీ నుంచి నిరుపేద దళిత మహిళకు ఎంపీపీ పదవి ఇస్తే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి డబ్బు ఆశ చూపి తన అనుచరుడిని ఎంపీపీ చేసేందుకు రాజీనామా చేయించడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎంపీటీసీ పదవికి కాంతమ్మ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకటేష్‌గౌడ్, నర్సింహులు, హరిగౌడ్, పర్వతాలు, బంగారు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొక్తధీర్ బాబా ఉర్సు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని హజ్రత్ అబ్దుల్ మొక్తదీర్ బాబా దర్గా వద్ద మంగళవారం రాత్రి ఉర్సు నిర్వహించారు. మొక్తధీర్ బాబా ఇంటి నుంచి గంధాన్ని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలకు యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం దర్గా వద్దకు చేరుకున్న తర్వాత గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ జి.ఇంద్రయ్యసాగర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టిశేఖర్, మండల కోఆప్షన్ మదీనా జమీర్ దర్గాలో ప్రార్థనలకు హాజరయ్యారు.

జిల్లా అధ్యక్షుడిగా నరేందర్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎ.నరేందర్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లాకు చెందిన కొత్త కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా సహాయ అధ్యక్షురాలిగా రాధ, ఉపాధ్యక్షులుగా భిక్షపతి, ఎండీ ఖురేషి, కార్యదర్శిగా టి. రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా సతీష్, హబీబ్‌రహమాన్, కోశాధికారిగా రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సుగుణ, ప్రచార కార్యదర్శిగా మోహన్, ఆఫీస్ కార్యదర్శిగా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా కొత్త కమిటీ సభ్యులు నియామక పత్రాలు అందుకున్నారు.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం


పశువులకు చికిత్స చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రషీద్

దేవరకద్ర: సీజన్ వారీగా పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రషీద్ సూచించారు. మంగళవారం దేవరకద్రలో ఏర్పాటు చేసిన పశువైద్య క్యాంపులో ఆయన మాట్లాడారు. పాడి పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, పాలఉత్పత్తి పెరగడానికి పశువైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. పశువులకు శిబిరంలో 220 ఆవులు, గేదెలు, దూడలకు చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి జీషన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో 'కంటివెలుగు' కొనసాగుతోంది. మంగళవారం మొత్తం 10 కేంద్రాల్లో 1,958 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 379 మందికి కంటి అద్దాలు అందజేశారు.

నవాబుపేట: అందరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రం అందించి కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది సరస్వతి, ఉమాదేవి, ప్రమీల, సునీత, విమల, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండలంలోని మన్సూర్‌పల్లిలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కవిత అధ్యక్షతన జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణ, ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మమత తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ పాల్, ఎంపీడీఓ శ్రీనివాసులు, వైద్యాధికారి శరత్‌చంద్ర, ఏపీఎం రామన్న, డాక్టర్ శృతి పాల్గొన్నారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్‌లో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగే అంతర్జాతీయ ఓపెన్ కరాటే పోటీలకు జిల్లా కేంద్రంలోని అల్‌నూర్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో మహ్మద్ సాబీర్‌పాష, షేక్ అర్సాలన్, మరియబేగం పాల్గొంటున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను డీఎస్పీ మహేష్ అభినందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల దేహదారుడ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, స్కూల్ డైరెక్టర్ ఖాజాపాష, కరస్పాండెంట్ మహ్మద్ అబ్దుల్ అహద్ సిద్ధిఖీ, ఉజేఫ్ షరీఫ్, నేహా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

